# శ్రీధర

శ్రీ చల్లా లక్ష్మీనరసింహశాస్త్రి

ప్రతి మానవుడి జీవితంలోనూ మరపురాని మధుర ఘట్టాలూ, విషాద పూరిత ఘట్టాలు వస్తూంటాయి. కాని ఎవరూ వాటిని గురించి ఎక్కువగా ఆలోచించరు. హృదయంగమయ్యే జీవిత ఘట్టాలను మరచి పోతుంటారుకూడా! ప్రతిమనుజుడు తన జీవితచరిత్రను తిరగవేసిచూస్తే ఒక్కొక్కప్పుడు తనకే మహాశ్చర్యాన్ని కలిగించే సన్నివేశాలుంటాయి. అలా అని ప్రతిజీవి చరిత్రను తెలుసుకోవాలంటే కొన్ని మహాయుగాలు పడుతుంది. పుట్టినదగ్గర్నుంచి గిట్టేవరకూ బాల్యయౌవన ప్రౌఢ వృద్ధాప్య దశలలో ఎన్నో చిత్ర విచిత్ర సన్నివేశాలుంటాయి. జీవితంలో కల్గిన మధుర సన్నివేశాలను, అనుభవాలను ఏజీవి కూడా మరచిపోవాలని వాంఛించదు; మరచి పోలేదు. జీవించి వున్నంతకాలం వాటిని మననం చేస్తుంటాడు. కాని ఒకానొకప్పుడు దుఃఖసముద్రంలో మునిగి పొందిన ఆవేదన, విచారము, మనోవైకల్యము, చిత్త విభ్రమణ నిగూఢంగా నిరాకారంగా సమసి పోవాలని తలుస్తాడో, వాటిని గురించి ఏమీ వినదలచడు, వినలేడు. సుఖంలోవుండే మాధుర్యాన్ని చవిచూచి దుఃఖంలో వుండే విషాదాన్ని అనుభవించాలని ఏజీవి కోరుతుంది. కష్టసుఖాలు కావడికుండల వంటివైనా మానవుడు సుఖాన్ని పొందినపుడు తనకు గల్గిన కష్టాన్నంతటినీ తృణప్రాయంగా చూస్తాడో, పిల్లలు పోరి పోరి గోలచేసి చివరకు తానుకోరింది పొందగల్గినపుడు ఆగమంతా మరచి ఎలాబుద్ధిమంతుల్లాగా తయారౌతారో అలాగే జీవితంలో కూడా కించిత్ సౌఖ్యం గల్గినపుడు ఆ అనుభవాన్ని వేయిరెట్లధికంచేసి వ్యక్తపరుప జూస్తాడు మానవుడు. కాని అదేవిషాద సంఘటన అయితే మనసులో పొడసూపకముందే అణగద్రొక్క ప్రయత్నిస్తాడు. సుఖానికి దుఃఖానికి గల తారతమ్యాన్ని నిర్ణయించలేక పోవటం ఆశ్చర్య పడవలసిన విషయం గాదు. సుఖం గల్గినప్పుడు కొండెక్కినా, దుఃఖంలో అడుగంటినా జీవితనౌక తన గమ్యస్థానాన్ని చేరేందుకు ప్రయత్నిస్తూనే వుంటుంది. కాలప్రవాహాని కెదురీదటం అశక్యం, అవివేకం కావచ్చు. కాని కొందరెదురీదక తప్పనిసరౌతుంది. తుదకు జయము పొందేది కాలమేకాని మానవుడు మాత్రం కాదు. యిలా కాలం ఎంతమందిని తన గర్భ కుహరంలో దాచి వుంచిందో తెలియదు.

అత్తుంగతరంగ పంక్తి సంకలితమైన ఉప్పసముద్రాలలో కూడా ధగ ధగ మెరిసే ధనరాసులున్నాయి. ఎన్నో రత్నాలను, మణులను తనలో లీనంచేసుకొనుంది. వాటిని బయటికితెచ్చి ప్రకాశవంతంగా చేయగల ధైర్య సాహసులకే అది కానుకగా అర్పిస్తుంది. రత్నగర్భ ఒక్క సముద్రమే కాదు, భూమి, కాలము దీనితో జతచేయబడ్డవే. భూమిని పలికిస్తే అమృతం చిలికిస్తుంది. ఆలాగే కాలం కూడా మహాపురుషులను తనలో లీనం చేసుకుంటూ ఆలాంటి వారిని ప్రసవిస్తూంటుంది. ఆ మణిని, రత్నాన్ని వెదకి సానబట్టి తేజోవంతంగా చేయాలి. అందువల్లనే ఇతరులలోకన్న మహాపురుషుల జీవితాలలో మహత్తరమైన ఘట్టాలు ఎక్కువగా కనిపిస్తాయి. వాటిని విస్తృతంచేసి అవగాహన చేసుకొన్నప్పుడే జీవితం సఫలమౌతుంది. ఆశలీడేరుతాయి.

ఒకజీవితానికి మరొక జీవితానికి సంబంధం వుండదు. భిన్న భిన్న వ్యక్తులు వివిధ వ్యాపారాల ద్వారా వివిధములైన చిత్తవృత్తులను కలిగివుంటారు.

చిత్తవృత్తిని బట్టి జీవితం నడక సాగుతుంది. వాటి ప్రవృత్తివల్లే పలురకాలైన అనుభవాలు కలుగుతాయి. లోకం ఒకరిసౌఖ్యాన్ని చూచి ఆనందిస్తుంది. ఒకరిని చూచి యీర్ష్య పడుతుంది. ఒకరి దుఃఖానికి సానుభూతి తెలుపుతుంది. ఒకరిని యీసడిస్తుంది. ఇదంతా మనుష్యుని నడవడిలో లీనమై యుంటుంది. దుఃఖం సానుభూతికి నిలయం! సౌఖ్యం యీర్ష్యకు నిలయం! యీ రెండింటి మధ్య అగాధం. ప్రతి జీవిలో యీ రెండూ మిళితమై యుంటాయి. వాటిని జీవితాలకు అన్వర్తింప జేసుకుండే విధానాలలో తేడావుంది. ఒక్కొక్క జీవితం ఒక్కొక్క ఆదర్శ అనుభవాల మీద నడుస్తుంటుంది. కొన్ని దరీదాపూ లేక గుట్టలు, మిట్టలు, ఎత్తు పల్లాలు పడుతూ పోతుంటాయి. కొన్ని రెంటిని సమం చేసుకుని సమ ప్రదేశంలో నడక సాగిస్తాయి. సృష్టిలోని సకల చరాచరుల రూపభావనలు నిర్ణయించబడుతాయి. దానిని బట్టే జీవితం జరిగి పోతుంటుంది!

కొండమీద నుండి చెంగు చెంగున దూకుతూన్న పిల్ల కాలువలను చూస్తూ, కెరింతలు కొడుతూ నిర్జనమైన ఆకొండల మధ్య నిర్భీతితో విహరిస్తున్నాము. కొండలమధ్య మొలచిన చెట్లు గుమ్మటంగావుండి అద్భుతమైన వింత ప్రకృతిని తెలియజేస్తున్నాయి. సువాసనా భరితమైన పూవులను తల్లులనుండి వేరుచేస్తూ, మకరందాన్నాస్వాదించటానికి వచ్చిన తుమ్మెదల ఝుంకారాల నాలకిస్తూ, వాటిని పట్టుకో బోయి పరుగెత్తి రాళ్ళుతగిలి క్రింద పడుతూ లేచి సంతోషంతో నవ్వుతూ పోతున్నాడు యశోధరుడు! అతని చిలిపి చేష్టలకు కోపోద్దీపితుడై నట్లుగా సూర్యుడు పశ్చిమ దిక్కున ఎఱ్ఱగా పొడసూపాడు. యశోధర్ తన ఆనందంలో నిమగ్నుడై వున్నాడు. ప్రకృతి దృశ్యాలను తిలకిస్తూ పలురకాల ఆలోచనలలోనై తిరుగుతున్నాను నేను. ఇలా ఎంతకాలం గడిచిందో తెలియదు. చీకటి నలుదిసల వ్యాపించే దాకా నాకు స్మృతిలేదు. ఆ కారు చీకటిలో ఏదీ కనబడక పోవటంచేత నిరుత్సాహుడై యశోధరుడు దగ్గరకు జేరాడు. ఇద్దరం కాసేపు మౌనం వహించాం!

యశోధర్ అన్నాడు. 'మనమివ్వాళ యింటికెళ్ళ పోతామో!' నని నాకు భయమేసింది. ఇంటిదగ్గర చేసిన గోల, చెప్పకుండా పరుగెత్తుకురావటం, చిన్న పిల్లల్ని కొట్టడం! చీకట్లో కొండ దిగిపోవటానికి శక్యం కాకుండావుంది.

'యశోధర్! యీరోజు కొండదిగి పోగలమా! అన్నం నీళ్లూ లేకుండా యిక్కడే పడుండాలేమో!' అన్నాను.

'ఏదైతే అదయింది, వెన్నెల వచ్చిందాకా వుండి తర్వాత దిగుదాం!' అన్నాడు యశో!

ఆరోజు సప్తమి, కృష్ణపక్షం కావటం వల్ల 14 ఘడియలకుగాని చంద్రోదయం కాదు. సరే అని అక్కడే కూర్చున్నాం.

అప్పటి మనోప్రవృత్తి ఎలావుంటుందో ఊహించి యిప్పుడు వ్రాయాలంటే కల్పనగా కన్పిస్తుంది. భీతితో కూడుకున్న మాలేత మనస్సులకు యితర వ్యాపారాలతో ఏం సంబంధం వుంటుంది? సహజంగా ధైర్యంగల యశోధర్ నాదీనావస్థ చూచి జాలిపడ్డాడు. అందరినీ పాతమూర్చి ఉద్భవించాను. బంధువుల ఆదరణ వల్ల బ్రతుకుతున్నాను. ఎవరేమంటారో అనేభయంతప్ప యితరమైంది ఏమీ లేదు. వాళ్లు నన్ను వెళ్లగొడితే నాగతి ఏమయ్యేదీ! ఊహించుకో లేకపోయేవాడిని. యశోధర్ నాకన్న మూడేండ్లు పెద్దయినా చూపులకు నామాదిరిగానే వుంటాడు. అతని పుట్టు పూర్వోత్తరాలు తెలియక పోయినా అతనితో ఎడతెగని స్నేహం ఏర్పడింది.

ఒకరోజు పాఠశాలలో పంతులు ప్రశ్నలు వేస్తున్నాడు, కాని యశోధరు మాత్రం నిలబడి వూరుకున్నాడు. వెంటనే అతని వీపుమీద నాలుగు పేము దెబ్బలు దబ దబ మని పడినై. పిల్లలందరూ గేలి చేశారు. అతను భరించుకున్నాడు. యశో పిల్లలందరిలోకి మంచి బలం, ధైర్యంగలవాడు. ఆటల్లో అందెవేసిన చెయ్యి. చదువులో మాత్రం పూజ్యం. సహజంగా ఆటల్లో ఆకతాయిగా తిరిగేవాడికి చదు

వులేమబ్బుతాయి. అప్పుడతని స్థితి చూచేటప్పటికి గేలిసేయటానికి బదులు నాకు చాల జాలికలిగింది. ఆదెబ్బలు నేను భరిస్తున్నట్లనిపించింది. అతడందరి వైపూ దీనదృక్కులతో చూచాడు. ఆటల్లో తన నన్ని విధాల గౌరవించేవాళ్లే తన్ను యిప్పుడు గేలి చేయటం వల్ల అతనికి భరింపరాని దుఃఖం వచ్చింది. నాకరుణారస దృక్కుల నతనివైపు ప్రసరించాను. అశ్రుపూరితమైన అతని కన్నులు నన్నాసమయంలో జాలిగా వేడుకున్నట్లనిపించింది. నాకు చెప్పలేనంత ప్రేమ వెల్లివిరిసిందతనిమీద! దానిని ప్రేమ అనాలో దయ, జాలి, కరుణ అనాలో స్నేహభావమనాలో నాకు తెలియదు. బడివదిలిం తర్వాత నేనతని దగ్గరకు వెళ్లాను. అతను నావైపు జాలిగా చూచి తల దించుకున్నాడు. నేనాతని బుజం మీద స్నేహపూర్వకంగా చేయివేసి ఊరి బయటికి తీసుకు వెళ్లాను. ఊరు నానుకొని ప్రవహించే కాలవగట్టు యిసుకతిన్నెల మీద కూర్చున్నాము. అతని చిత్తక్షోభ ఉపశమింప జేయటానికి మలయపవనుడు పరుగెత్తుకొస్తూ మమ్మల్ని సమీపించాడు. నేనాతని కేవేవో మాటలు చెప్పి ఉత్సాహం గల్గించాను. ఎన్నో కథలు చెప్పుకున్నాం. అతడు ఆ ఆనందంలో తన దుఃఖాన్ని విచారాన్ని మరచిపోయాడు. విచారాల్లో, దుఃఖాల్లో ప్రాణస్నేహితులు అవసరమని నాకప్పుడే తెలిసింది. స్నేహితులుగాని, వినోద విన్యాసాలుగాని లేకపోతే దుఃఖితుల పరిస్థితి ఏలా వుంటుందో ఊహించుకున్నాను. దుఃఖాన్ని అనునయింపజేయటానికి, దుఃఖసాగరాన్ని దాటడానికి ప్రాణస్నేహితుడనే నౌక ముఖ్య అవసరమని గ్రహించాను. ఆనాడు చంద్రుడుదయించి, అస్తమించే దాక ఆనదీగట్టునే ఆనందంగా గడిపాము. మాయిద్దరి మనసులు పాశబద్ధమైనాయి. గాఢ స్నేహం మనుష్యులనెంతో దగ్గరికి జేరుస్తుంది. అప్పటినుండి ఒకరిని విడిచి మరొకరం వుండలేక పోయ్యేవాళ్లం. క్రమంగా మా తనువులు భేదం తప్ప ప్రాణాలొకటైనాయి. బీదవారికి బీదవారిపైన కరుణవుంటుంది, కాని ధనికులకు బీదవారిపైనకరుణ సామాన్యంగావుండదు. యశోధరు బీదవాడని తెలుసు. అతనికి సవతితల్లి ఒకామె మాత్రం వుంది. అతనికి ఆమె చదువు చెప్పిస్తూ పోషిస్తున్నది. ఆమె కెవ్వరూ లేకపోవటం వల్ల యశోధరునే ప్రాణంగా పెంచుతున్నది. నేను ప్రతిరోజూ బడికిపోయేటప్పుడు యశోధరును పిలుచుకుపోతుండేవాడిని. అప్పుడప్పుడు వాళ్లింట్లో కూర్చొని ఏదోమాట్లాడేవాడిని. అక్కడే ఆడుకుండే వాళ్లము. యశోధర్ తల్లిపేరు అభయ. ఆమెగూడా నన్ను తనకుమారునిలాగా ఆదరించేది. అందువల్ల ఆమె దగ్గరగూడా చనువు ఎక్కువ దొరకింది. అప్పటినుంచి యశోధర్ నేనూ ప్రతిరోజూ బడివదలంగానే కబుర్లు చెప్పుకుంటూ, తోటలంట, ఊరిబయట, యిసుక తిన్నెలమీద, కొండగుట్టలమీద తిరుగుతుండేవాళ్లము. యితర్లు మమ్మల్ని అన్నాదమ్ములనుకునేవాళ్లు. నిజంగా నేనప్పుడప్పుడూ యశోధరును 'అన్నా' అని పిలిచేవాడిని. యీపిలుపువిని అభయ ఎంతో సంతోషపడేది. అప్పుడప్పుడు ప్రేమతో ముద్దుగొనేది. నాకామె దగ్గర ఎంతచనువో అంతభక్తిగూడా కుదిరింది. వాళ్లింట్లో నాకే అడ్డంకీలేదు. యశోధరు చిత్ర విచిత్రమైన కథలు చెప్పుతూండేవాడు. నేను ఆశ్చర్యపోతూ వింటుండేవాడిని, యీసంగతులన్నీ ఎప్పుడు తెలుసుకున్నాడా! ఎవరిదగ్గర నేర్చుకున్నాడా అని! కొన్ని కథలువింటుంటే భయం కలిగేది. సంతోషం కలిగేది!

ఒకనాడు సాయంత్రం కాలవ గట్టుమీద కూర్చున్నాం. అప్పుడే కాలువనిండి వచ్చింది. కొంతసేపయ్యేటప్పటికి యశో 'శ్రీధర్'! యవ్వాళ కాలువలో మునకెయ్యాలి! రా! అంటూ చెయ్యిబట్టి లేవదీశాడు. యశో గజ యీతగాడు. ఆ కాలువను యీగట్టునుండి ఆగట్టువరకూ సులభంగా యీదుతాడు. ఒక్కొక్క మునుకకు ఫర్లాంగు దూరంపోయి తేల్తుంటాడు. దమ్ముపట్టడంలో అతనితో సమానమైనవాడు లేడనేచెప్పాలి. నాకు యీతబాగా చేతగాదు. కానికొద్దిగా నేర్చుకున్నాను యశోధరువల్ల. అతనిమాట తీసేయలేక

పరేనని గుడ్డలువిప్పి కాలువలోకిదిగాను. అతడు నాకంటే ముందుదూకి మునక లేస్తున్నాడు. నేను ఒడ్డునే యీదటం చూచి 'ఇంకా అక్కడేనా! లోతుకురా! యివాళ నీకు వెల్లికిలా పడుకొని యీదడం నేర్పుతా! యీ యీత నేర్చుకొంటే నీటి మీద పడుకొని ఎంతదూరం పోవాలనుకుంటే అంత దూరం పోవచ్చు.' అని చేయి పట్టిలాక్కుపోయాడు. నాకు భయమేసింది. కాని పైకి కనబడనీయలేదు. అతడు నన్ను చేతుల్లో నీళ్ళపైకి యెత్తి యిలా! అలా! అంటూ ఏవేవో చెప్పాడు. కాని నాకు బాగా చేతగాలేదు. కొద్దిసేపు శ్రమపడి ఒక విధంగా కొంత వరకు నేర్చుకున్నాను. యశోదరు నన్ను వదలి యీదుకుంటూ పోతున్నాడు. నేను కొంతసేపు యీదేటప్పటికి అలసట గలిగింది. నది మధ్యలో వున్నాను. గట్టుకు పోదామనుకుంటూ యీదు తున్నాను. కొంత దూరంపోయి అలసట తీర్చుకోటా నికి నిలుచున్నాను. కాని అంతలోకే నా కాళ్లు లోపలికి చొచ్చుకు పోతున్నాయి. ఊబిలో దిగ బడి పోతున్నాను. యశోదరుని కేకవేశాను ఊబిలోనుండి బయట పడటం అశక్యం. అతనికి నాపిలుపందలేదు. 'అన్నా! అన్నా!' అని కేక వేశాను. అప్పటికీ వినబడలేదు. నేను మునిగి పోతున్నాను, నీళ్లు కంఠం దాటుతున్నాయి. నాకు భయమధికమైంది. మళ్లీ గట్టిగా అరిచాను యశోదరు నావైపు చూచాడో లేదో నేను చూడలేదు. చేతులు పైకెత్తి మునిగి పోతున్నాను. అతడు వచ్చాడులాగుంది నిలువు యీతమీద నిలుచున్నాడు. చేతులు పట్టుకుని పైకిలాగటం మొదలుపెట్టాడు. అతడు నాకన్నా బలవంతుడు కావటం నామేలుకొరకే అయింది. ఏలాగైతేనేం బయటకులాగి ఒడ్డుకుచేర్చి పొట్టనొక్కాడు నీళ్లు తాగానేమోనని. యింకా అంతవరకు రాలేదు అందుకు సంతోషించాము. కాసేపయింతర్వాత లేచి కూర్చున్నాను. యశోధర్ నావంక ప్రశ్నా రకంగాచూస్తూ 'అటువూబి వుందని తెలిసి గూడా అటెందుకెళ్లావ్,' అన్నాడు. 'నేను సమాధానంగా కళ్లతోనే చెప్పాను నాకు తెలియద'న్నట్లుగా! నాడు నాప్రాణాలను కాపాడినదగ్గర్నుంచి అతని మీద స్నేహభావం మరింత వృద్ధి కాజొచ్చింది. యీసంగతి ఎవ్వరికీ తెలియనీయకుండా మామన సుల్లోనే పదిలపరచాం.

(సశేషము)


## బిల్వ, వేప

బిల్వ, వేప అను జాతీయమూలికలనుగూర్చి శాస్త్రవిషయక పరిశ్రమచేసి వ్రాయబడిన ఉత్తమ గ్రంథరాజములు. ఈ మూలికల ఓషధిగుణము, వైద్యప్రయోగములు, శాస్త్రచర్చ, పురాణ వివరము, సరళశైలిలో వివరింపబడినవి. వైద్యులకు, భక్తులకు మిక్కిలి ఉపయోగకరమైన గ్రంథములు. క్రౌనుసైజున మంచి ఫెదరువైటు కాగితములమీద ముద్రింపబడి గృహలక్ష్మి గ్రంథమాలలో ద్వితీయ తృతీయ కుసుమములుగా ప్రచురింపబడినవి

గ్రంథకర్త: కే. యన్. కేసరి ప్రతి 1-కి 0-12-0

గృహలక్ష్మి కార్యాలయము, రాయపేట :: మద్రాసు.